క్లుప్తంగా

ఎక్స్‌రే కిరణాల అనువర్తనాలపై సదస్సు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజశేఖర్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో ఎక్స్‌రే కిరణాల అనువర్తనాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ఫా స్కాన్స్ అధినేత డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ, మానవ శరీరంలో దంతాలు, కీళ్లు, దంత క్షీణత, ఎముకుల పటుత్వం, తదితర వివరాలను ఎక్స్‌రే కిరణాలు ఉపయోగించి తెలుసుకోవచ్చునన్నారు. దంత పరీక్షలు, జీర్ణాశయ సమస్యలు, యూరినర్ సమస్యలను నిర్ధారించేందుకు కూడా కిరణాలు ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో వీసీ పీకే మహంతి, రిజిస్ట్రార్ పల్లవి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి



మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు

విజయనగరం: మున్సిపల్ శాఖలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని విజయనగరం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. రంగరాజు, జలగడుగుల కామేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగరాజును శుక్రవారం కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులందరికీ పర్మినెంట్ చేయాలని, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తూ చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కె.శ్రీను, టి.శ్రీను, కె.చిరంజీవి, రాజు, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మిదేవికి సువర్ణ పుష్పార్చన



సువర్ణ పుష్పాలతో మహాలక్ష్మి

విజయనగరం రూరల్: దుప్పాడ గంగానగర్‌లోని భారతీయ తత్త్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రమ్‌లో కొలువై ఉన్న మహాలక్ష్మి దేవి అమ్మవారికి శుక్రవారం సువర్ణ పుష్పార్చన చేశారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని దేవాలయం అర్చకుడు చామర్తి రమేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. ఉత్సవంలో దేవాలయం ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, సముద్రాల గురుప్రసాద్, గిరిజాప్రసన్న దంపతులు, కంచర్ల రాజేశ్వరరావు, రాధ దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజలకు ఓటు అడిగే హక్కు మనకే ఉంది..

- విశాఖ రాజధానిగా అభివృద్ధి చెందడం చంద్రబాబుకు ఇష్టం లేదు
- ప్రభుత్వానికి పేరు వస్తుందన్న అక్కసుతోనే అడ్డంకులు
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులకే ఓట్లు అడిగే హక్కు ఉందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. విజయనగరంలోని తన నివాసం వద్ద నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్లకు పార్టీ తరపున శుక్రవారం బీమా చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2019 ఎన్నికలకు ముందు పాదయాత్రలో ప్రజల కష్టాలను కళ్లారా చూసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి .. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్ని అవాంతరాలు ఎదురైనా, మాట తప్పకుండా నవరత్నాల పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో కులమతాలు, రాజకీయాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నారన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజలకు అండగా నిలిచిన విషయాన్ని గుర్తు చేశారు. దేశంలోనే అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం మనదేనని చెప్పారు.

రాజధానికి అడ్డంకులు...

ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు తన స్వార్థం కోసమే అమరావతిని రాజధానిగా ప్రకటించారని కోలగట్ల ఆరోపించారు. రాష్ట్ర విభజన తర్వాత అతి పెద్ద పట్టణమైన విశాఖను రాజధాని చేస్తే పెట్టుబడులకు అనుకూలంగా ఉంటుందని, తద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయవచ్చని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మూడు రాజధానులకు తెరలేపారన్నారు. మూడు రాజధానులైతే విశాఖ మరో హైదరాబాద్‌గా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే జరిగితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి పేరు వస్తుందన్న అక్కసుతోనే ప్రతిపక్ష నాయకులు అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. 2014లో జాబు కావాలంటే బాబు రావాలని, డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేస్తానని నమ్మబలికిన చంద్రబాబు... వారందరినీ నిలువునా ముంచారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వారందరికీ అండగా నిలిచామన్నారు. 2024 ఎన్నికల అనంతరం రాష్ట్రంలో టీడీపీ నామరూపాలు లేకుండా పోతుందన్నారు.

ఆస్తులు అమ్మిన చరిత్ర అశోక్‌ది..

జిల్లా కేంద్రమైన విజయనగరం నియోజకవర్గంలో అభివృద్ధిపై విమర్శలు చేస్తున్న టీడీపీ నాయకులు వాస్తవాలను తెలుసుకోవాలని కోలగట్ల హితవు పలికారు. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు తన హయాంలో ఒక్క ప్రభుత్వ విద్యా సంస్థ అయినా తెచ్చారా? అని ప్రశ్నించారు. తమ హయాంలోనే విజయనగరానికి జేఎన్‌టీయూ, ప్రభుత్వ వైద్యకళాశాల, ఇతర ప్రభుత్వ విద్యాసంస్థలు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అశోక్ పాలనలో తొమ్మిది వేల గజాలు ఉన్న విలువైన ఆర్టీఓ కార్యాలయ స్థలాన్ని అమ్మారని.. సర్కస్ గ్రౌండ్, పాత బస్టాండ్ దగ్గర ఉన్న క్యాటిల్ డిపో, రింగ్‌రోడ్‌లో డంపింగ్ యార్డ్ స్థలాలను సైతం విక్రయించారని తెలిపారు. గతంలో అన్న క్యాంటీన్ల పేరుతో పేదలకు పెట్టే భోజనంలోనూ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. తాము నగరంలో ఆరుచోట్ల ఫుడ్ బ్యాంకులు పెట్టి ఉచితంగా భోజనం అందిస్తున్నామని.. ఈ విషయంలో ఎవరు గొప్ప? అని ప్రశ్నించారు.



హాజరైన జేసీఎస్ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు

సచివాలయ కన్వీనర్లకు భరోసా

సచివాలయ కన్వీనర్లు పార్టీ కోసం కష్టించి పనిచేస్తున్నారని, వారికి అండగా నిలిచేందుకే బీమా సదుపాయం కల్పిస్తున్నామని కోలగట్ల తెలిపారు. రూ.2.50 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ బీమా చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ అప్పగించిన పనులను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్, జేసీఎస్ కన్వీనర్లు ఆశపు వేణు, ఎస్‌వీవీ రాజేష్, సంగంరెడ్డి బంగారునాయుడు, ముద్దాడ మధు, పార్టీ జోనల్ ఇన్‌చార్జ్‌లు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన అజెండా



రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల
- రూ.3.22 కోట్లతో ఆర్‌అండ్‌బీ జంక్షన్ – పాల్‌నగర్ రోడ్డు విస్తరణ

విజయనగరం: అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన అజెండాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పని చేస్తోందని, ఇందులో భాగంగానే విజయనగరం కార్పొరేషన్ పరిధిలో రోడ్లు, ఇతర సౌకర్యాలను అభివృద్ధి చేస్తున్నట్లు మహా విశాఖ ప్రాంతీయ నగరాభివృద్ధి (వీఎంఆర్‌డీఏ) సంస్థ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అన్నారు. రూ.3.22 కోట్ల వీఎంఆర్‌డీఏ నిధులతో నగరంలోని ఆర్‌అండ్‌బీ జంక్షన్ నుంచి పాల్‌నగర్ వరకు చేపట్టనున్న 1.08 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో కలసి శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అక్కరమాని విజయనిర్మల మాట్లాడుతూ, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో వివిధ రకాల గ్రాంట్లతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. తాజాగా చేపడుతున్న 80 అడుగుల వెడల్పుతో ఆర్ అండ్‌బీ జంక్షన్ నుంచి పాల్‌నగర్ వరకు చేపట్టదలచిన రోడ్డు విస్తరణతో కార్పొరేషన్ పరిధిలోని ఐదు డివిజన్ల ప్రజలతో పాటు మండల పరిధిలోని పది గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. విస్తరణ పనుల్లో భాగంగా రెండు లేన్ల బీటీ రోడ్డును అభివృద్ధి చేసి మధ్యలో డివైడర్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో నాలుగున్నరేళ్ల కాలంలో గతంలో ఎన్నడూలేని విధంగా నగరం అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వి.విజయలక్ష్మి, కార్పొరేటర్లు పిన్నింటి కళావతి, వి.ప్రభాకరరెడ్డి, తొగరోతు సంధ్యారాణి, దాసరి సత్యవతి, వీఎంఆర్‌డీఏ పర్యవేక్షక ఇంజినీర్ వి.భవానీశంకర్, ఈఈ శ్యామ్‌ప్రసాదరావు, డీఈ కార్తీక, ఏఈ ప్రసాద్, కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శిలో కొనసాగుతున్న తనిఖీలు

విజయనగరం క్రైమ్:

రాష్ట్ర వ్యాప్తంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో చేపడుతున్న తనిఖీల్లో భాగంగా జిల్లా కేంద్రంలో ఎన్‌సీఎస్ థియేటర్ పక్కన ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్ కార్యాలయాన్ని సీఐడీ అధికారులు రెండో రోజైన శుక్రవారం కూడా తనిఖీ చేశారు. జిల్లా పోలీసుల బందోబస్తు నడుమ తనిఖీలు జరిగాయి.

పంటల వివరాల నమోదు తప్పనిసరి

- జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు



సాగు మెలకువలను వివరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు

డెంకాడ: రైతులందరూ తప్పనిసరిగా తాము సాగు చేస్తున్న పంటల వివరాలను యాప్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు అన్నారు. మండలంలోని సింగవరంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంట నమోదు వల్ల చాలా ప్రయోజనాలుంటాయన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు పంటలు నాశనమైతే బీమా వర్తిస్తుందని చెప్పారు. సున్నా వడ్డీపై రుణాలు కూడా పొందే అవకాశం ఉందన్నారు.

రామారావుకు సత్కారం..

జిల్లా ఉత్తమ అధికారిగా అవార్డు పొందిన జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావును రైతులు, గ్రామ పెద్దలు సత్కరించారు. కార్యక్రమాల్లో ఏఓ నిర్మల, ఏఈఓ రామకోటి, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి బి.సుజాత, సింగవరం, నాతలవలస గ్రామాల పెద్దలు పిట్టా అప్పారావు, బమ్మిడి వెంకటరమణ, అప్పలస్వామినాయుడు, భావన గురువులు, రైతులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో బంగారు భవిష్యత్ నాశనం



మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

- ఎస్పీ దీపిక

డెంకాడ: మాదకద్రవ్యాల వినియోగంతో బంగారు భవిష్యత్ నాశనమవుతుందని ఎస్పీ దీపిక అన్నారు. చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైతే విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడుతుంటారని చెప్పారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, సైక్రియాటిస్ట్ డాక్టర్ ఎస్‌వీ రమణ, డాక్టర్ హరీష్, ఎస్‌బీ సీఐ విజయ్‌నాథ్, భోగాపురం సీఐ బీవీ వెంకటేశ్వరరావు, ఎస్సై యు.మహేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతో దేశాభివృద్ధి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



రౌతు జగదీష్ స్మారకార్థం ఏర్పాటు చేసిన శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ భగత్‌సింగ్, తదితరులు

విజయనగరం: దేశాభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాలలో భాగంగా అయ్యకోనేరు గట్టు ప్రాంతంలో శుక్రవారం మొక్కలు నాటారు. 'నా మట్టి – నా దేశం' నినాదంతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడుతో కలిసి డిప్యూటీ స్పీకర్ పాల్గొన్నారు. అంతకుముందు సీఆర్‌పీఎఫ్ జవాన్ రౌతు జగదీష్ స్మారకార్థం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం జగదీష్ కుటుంబ సభ్యులను సత్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ.. దేశ రక్షణ, అభివృద్ధికి ప్రతి భారతీయుడు పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపుమేరకు నా మట్టి – నా దేశం నినాదంతో 350 వరకు మొక్కలు నాటినట్లు చెప్పారు. దేశం కోసం ప్రాణాలర్పించిన సీఆర్‌పీఎఫ్ జవాన్ రౌతు జగదీష్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే యువత భాగస్వామ్యం అవసరమన్నారు. ఆనాటి స్వాతంత్రోద్యమంలో ప్రాణాలు, ఆస్తులను కోల్పోయి మనకు స్వేచ్ఛావాయువులను అందించిన ఎందరో మహానుభావుల స్ఫూర్తికి కొనసాగింపుగా ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు ఏడాది పొడవునా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు హరితవనాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే నగరంలోని చెరువులు, పార్కులు, జంక్షన్లను అభివృద్ధి చేశామన్నారు. సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ భగత్‌సింగ్ మాట్లాడుతూ, జన్మభూమి కోసం ప్రాణాలర్పించిన రౌతు జగదీష్ అమరుడన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాలలో భాగంగా దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులను స్మరించుకుంటూ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ సంగంరెడ్డి బంగారునాయుడు, సీఆర్‌పీఎఫ్ జవాన్ కుటుంబ సభ్యులు రౌతు సింహాచలం, సరస్వతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు నాయన మహేష్ పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- పీఆర్‌ఆర్‌డీ ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్



సచివాలయం-1 భవనాన్ని పరిశీలిస్తున్న పీఆర్‌ఆర్‌డీ ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్



డెంకాడ: సింగవరం గ్రామ సచివాలయ భవనాన్ని పరిశీలిస్తున్న పీఆర్‌ఆర్‌డీ ప్రత్యేక కార్యదర్శి బి. రాజశేఖర్

భోగాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సచివాలయ, వెల్‌నెస్, రైతుభరోసా భవన నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, రూరల్ డవలప్‌మెంట్ ప్రత్యేక కార్యదర్శి బి. రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయాన్ని, నిర్మాణంలో ఉన్న రైతుభరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆర్‌బీకే ముఖద్వారం నమూనాలో ఉన్న ప్రకారం కాకుండా వేరేవిధంగా ఎందుకు నిర్మిస్తున్నారని జేఈ చంద్రునాయుడును ప్రశ్నించారు. భవన నిర్మాణాల్లో వెంటిలేషన్ పనులు సరిగాలేవంటూ మండిపడ్డారు. అనంతరం అమృత్ సరోవరం కార్యక్రమంలో భాగంగా నందిగాం పంచాయతీలో నిర్మించిన చెరువు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీలో ఎన్ని గృహాలున్నాయి.. గృహాల నుంచి రోజుకు ఎంతమేర తడి, పొడి చెత్తను సేకరిస్తున్నారు.. వాటి ద్వారా ఒక నెలలో ఎన్ని టన్నుల సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారన్న విషయాలపై ఆరా తీశారు. చెత్త నుంచి ఎరువును తయారు చేస్తున్న తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తూ సర్పంచ్ గరే మరిణీమోహనరావు అభినందించారు. త్వరలోనే నందిగాం పంచాయతీకి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా కృషి చేస్తానని సర్పంచ్‌కు హామీ ఇచ్చారు. పరిశీలనలో ఆయన వెంట పీఆర్ ఇంజినీరింగ్ చీఫ్ బాలునాయక్, ఇన్‌చార్జ్ ఎస్‌ఈ శ్రీనివాసులు, పంచాయతీ ఈఈ కేజేజే నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజినీర్ టి. గాయత్రీదేవి, డీపీఓ శ్రీధర్‌రాజా, డ్వామా పీడీ ఉమా పరమేశ్వరి, డీఈలు బంగారునాయుడు, వైకుంఠనాయుడు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు..

డెంకాడ: గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పీఆర్‌ఆర్‌డీ ప్రత్యేక కార్యదర్శి బి. రాజశేఖర్ అన్నారు. మండలంలోని సింగవరం గ్రామ సచివాలయాలన్ని ఆయన సందర్శించి, సచివాలయ భవన నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్లను పరిశీలించి పలు సూచనాలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఇతర విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం..

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



నెల్లిమర్ల రూరల్ : లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని ధామస్‌పేటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఇంతవరకు పొందిన పథకాల లబ్ధిని వివరించారు. అలాగే స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో టీడీపీ నేతలకు మేలు జరగ్గా, ప్రజలు మాత్రం నష్టపోయారన్నారు. ప్రస్తుతం ఇళ్ల ముంగిటికే పథకాలు అందుతుండడంపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయాలనే ఉద్దేశంతోనే ఇంటింటా పర్యటిస్తున్నామన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తున్న సీఎం జగనన్నకు అంతా మద్దతుగా నిలవాలన్నారు. ఈ నేపథ్యంలో పలువురు ఇళ్ల పట్టాల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా..పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రూ.3 లక్షల నిధులతో ఏర్పాటు చేయనున్న తాగునీటి మినీ ట్యాంక్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, కార్పొరేషన్ డైరెక్టర్లు జానా ప్రసాద్, మద్దిల వాసు, రేగాన శ్రీనివాసరావు నాయకులు గంటా సత్యనారాయణ, గంటా అప్పలరాజు, కౌన్సిలర్లు పాండ్రంకి సత్యవతి, మైపాడ ప్రసాద్, తహసీల్దార్ శైలజ పాల్గొన్నారు.

ప్రజలకు చేరువుగా ప్రభుత్వ సేవలు..



విజయనగరం : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విజయనగరం: ప్రజలకు సంక్షేమ పథకాలు చేరువ చేయడే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు కోలగట్ల తమ్మన్నశెట్టి, డాక్టర్ వీఎస్ ప్రసాద్ అన్నారు. నగరంలోని 42వ డివిజన్‌లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొని, ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పాలనపై ఆరా తీస్తూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ్మన్నశెట్టి, డాక్టర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, గత ప్రభుత్వం చేయని అనేక సంస్కరణలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారన్నారు. పాలనలో సమూలమైన మార్పులు తీసుకొచ్చి సచివాలయ వ్యవస్థ ద్వారా అవినీతిరహితంగా పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పిన్నింటి కళావతి, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాసంలో పైడితల్లికి ప్రత్యేక పూజలు

- ఈఓ కేఎల్ సుధారాణి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ ఈఓ సుధారాణి

విజయనగరం టౌన్: సిరుల తల్లి పైడితల్లి అమ్మవారికి శ్రావణమాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ కేఎల్ సుధారాణి అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఈఓ కార్యాలయంలో వనంగుడి, చదురుగుడిలలో నిర్వహించే పూజలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సెప్టెంబర్ 9వవరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామన్నారు. ప్రతి మంగళవారం పంచామృతాలతో అభిషేకాలు, ప్రతిరోజూ శ్రీచక్రార్చన పూజలు, విశిష్ట కుంకుమార్చనలు, శ్రావణ శుక్రవారాల్లో అమ్మవారికి అభిషేకాలు, అర్చనలతో పాటు వరలక్ష్మీవ్రతాలు, శ్రావణ పౌర్ణమి రోజున స్వర్ణ పుష్పార్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, సూపర్‌వైజర్ ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.